# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ అధికార పత్రిక 'పహాట్'కు

# సిఎంసి ఇన్‌చార్జి కామ్రేడ్ బసవరాజ్ (బి.ఆర్.) ఇచ్చిన ఇంటర్వ్యూ

**ప్రశ్న 1 : మావోయిస్టులు దేశానికి అత్యంత ప్రమాదకరమని మన్‌మోహన్ సింగ్ అంటున్నాడు. మావోయిస్టులు తాము చేస్తున్నది ప్రజాయుద్ధం అంటున్నారు. మీరు ప్రజాయుద్ధాన్ని ఎలా నిర్వచిస్తారు?**

**బి.ఆర్. :** దీనికి సమాధానం అనేక మంది ప్రజాస్వామికవాదులు ఇప్పటికే చాలా సార్లు చెప్పి ఉన్నారు. మావోయిస్టులు దేశానికి అత్యంత ప్రమాదకరమని ప్రధాన మంత్రి మన్‌మోహన్ సింగ్ అనడానికి కారణం ఏమిటి అనే ప్రశ్నతో దీనికి సమాధానం వెతకాల్సి వుంటుంది. దేశంలో కార్మిక–కర్షక తదితర పీడిత ప్రజల ప్రయోజనాల కోసం, ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం, నూటికి 90 శాతంగా ఉన్న ప్రజల అధికారం, స్వావలంబనతో కూడిన ప్రజాస్వామిక ఆర్థిక వ్యవస్థ కోసం, దేశ సార్వభౌమాధికారం, దేశ వనరుల రక్షణ కోసం మావోయిస్టులు పోరాడడం ఏ విధంగా దేశ భద్రతకు ప్రధాన ముప్పు కాగలదు?

2006లో ఆయన 'దేశ అంతర్గత భద్రతకు వామపక్ష తీవ్రవాదం ఏకైక అతి పెద్ద ప్రమాదకర శక్తి' అని తొలిసారిగా ప్రకటించాడు. సరిగ్గా దీనికి కొద్దిగా ముందు 2004 సెప్టెంబర్ 21న భారతదేశ విప్లవోద్యమంలో సుదీర్ఘకాలం వేరు వేరు ప్రవాహాలుగా కార్యాచరణను కొనసాగించిన రెండు విప్లవ పార్టీలు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు) (పీపుల్స్‌వార్), భారత మావోయిస్టు కమ్యూనిస్టు కేంద్రం ఒకే ప్రవాహంగా విలీనమై భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించింది. వాటి నాయకత్వంలో ఏర్పడి ఉన్న ప్రజా గెరిల్లా సైన్యం, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం రెండూ సంలీనమై నూతన 'ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం' ఏర్పడింది. అప్పటికే ఆదివాసీ ప్రాంతాలలోని ఖనిజ నిక్షేపాలను, ప్రకృతి వనరులను కొల్లగొట్టేందుకు దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు చెందిన అనేక కార్పొరేట్ కంపెనీలతో ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిషా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల ప్రభుత్వాలు ఎం.ఓ.యు. (మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్)లపై సంతకాలు చేశాయి. టాటా, ఎస్సార్, జిందల్, మిత్తల్, వేదాంత, జయస్వాల్స్ నెకో వంటి కార్పొరేట్ కంపెనీలు ఈ ప్రాంతాల్లో వేగంగా చొరబడుతున్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని అధికార యు.పి.ఏ, బిజెపి నేతృత్వంలోని ఎన్.డి.ఏ., సిపిఐ, సిపిఎం, ఇతర ప్రాంతీయ పార్టీలు మొదలైన దళారీ పాలకవర్గ పార్టీలన్నీ వాటి ముందు సాగిలబడుతున్నాయి. కోట్లాది రూపాయల

ముడుపులకు బదులుగా వీళ్లు దేశ సంపదలనే కాదు, సార్వభౌమత్వాన్ని సైతం కుదవ బెట్టడానికి వెనకాడడం లేదు. 2008 నుండి ప్రపంచవ్యాప్తంగా బద్దలైన తీవ్ర ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో వెనుకబడిన దేశాలలోని సహజ వనరుల దోపిడికి తీవ్రమైన వెంపర్లాట పెరిగింది. ఈ సంక్షోభం ఎంతో లోతైనదనీ, 1930ల నాటి ఆర్థిక సంక్షోభానికి మించినదనీ బూర్జువా ఆర్థికవేత్తలే చెబుతున్నారు. ఫలితంగా మన దేశంలోని సహజ సంపదల్ని దోచుకోవడానికి సామ్రాజ్యవాద, కార్పొరేట్ సంస్థలు మరింత దూకుడుగా ప్రయత్నిస్తున్నాయి. కానీ భారత ప్రజలు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ఎందుకంటే ఈ నిలువు దోపిడికి అనుమతివ్వడమంటే 'జల్–జంగల్–జమీన్' వినాశనమూ, కోట్లాది ప్రజలు నిర్వాసితులు కావడమే జరుగుతుంది తప్ప దేశ పాలకులు చెబుతున్నట్లుగా 'అభివృద్ధి' ముమ్మాటికీ జరగదు. 'జల్–జంగల్–జమీన్'పై ఆదివాసులకే అధికారం ఉండాలని మనం కోరుతున్నాం. ప్రజల ప్రతిఘటనా పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ముందు వరుసలో నిలబడింది. దీని ఫలితంగా ఈరోజు లక్షల కోట్ల రూపాయల ఎం.ఓ.యు.లు అమలు కావడం లేదు. అనేక చోట్లలో గనుల తవ్వకం పనులు నిలిచిపోయాయి. మైనింగ్ మాఫియాను ప్రజలు తన్ని తరిమేస్తున్నారు. అనేక భారీ పరిశ్రమల పనులు నిలిచిపోయాయి. అనేక భారీ డ్యాంల నిర్మాణం ఆగిపోయింది. దీంతో కార్పొరేట్ సంస్థలు, వాళ్ల ప్రభువులైన సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదులు గంగవెర్రులెత్తుతున్నారు.

ఇలా ఒకపక్క దోపిడి పాలక వర్గాల బూటకపు అభివృద్ధిని వ్యతిరేకిస్తున్న ప్రజలు, విప్లవోద్యమం బలంగా ఉన్న దండకారణ్యం, బీహార్–ఝార్ఖండ్‌తో సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో మన పార్టీ నాయకత్వంలో విప్లవ ప్రజానీకం ప్రాథమిక స్థాయిలో విప్లవ ప్రజాస్వామిక రాజ్యాధికార సంస్థలను ఏర్పర్చుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య, తదితర అభివృద్ధి నిరోధక శక్తుల అధికారాన్ని ధ్వంసం చేస్తూ పీడిత ప్రజలు నిర్మించుకుంటున్న 'విప్లవ ప్రజా కమిటీ' లేదా 'క్రాంతికారీ జనతన సర్కార్' ముందుకు తెస్తున్న ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా వల్ల ప్రస్తుత భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల రాజ్యాధికారానికి తీవ్రమైన సవాలు ఎదురవుతున్నది.

సరిగ్గా ఈ కారణంగానే భారత దళారీ పాలకవర్గాలు 2004 నుంచి 2008 వరకూ ఝార్ఖండ్‌లో సేంద్ర, నాగరిక్ సురక్షా సమితి, బీహార్‌లో వివిధ రకాల భూస్వామ్య ప్రైవేట్ సేనలు, విప్లవ ప్రతీఘాతుక సంస్థలు, దండకారణ్యంలో సల్వాజుడుం, పశ్చిమ బెంగాల్‌లో సోషల్ ఫాసిస్టు హర్మద్ వాహిని, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన భైరవ్ వాహిని, నారాయణపట్నా (ఒడిషా) ప్రాంతంలో శాంతి కమిటీ వంటి విప్లవ ప్రతీఘాతుక క్యాంపెయిన్లు, సంస్థలు, ప్రైవేట్ సేనల ద్వారా విప్లవోద్యమాన్ని రూపుమాపాలని తీవ్రంగా ప్రయత్నించాయి. 2009 నుంచి ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను ఆరంభించాయి. నేడు అది రెండవ దశకు చేరుకుంది. ఇది

రోజు రోజుకూ తీవ్రతరమవుతూ అత్యంత క్రూరమైన ఫాసిస్టు రూపం తీసుకుంటోంది. 2003లో ఝూర్ఖండ్‌లో తూర్పు సింఘ్‌భూం జిల్లా లాంగో గ్రామంలో 13 మంది విప్లవ కార్యకర్తల ఊచకోత నుంచి చూసుకుంటే, సల్వాజుడుం తెల్లబీభత్సంలో 2005 నుంచి 2008 వరకూ దంతేవాడ, బీజాపూర్, బస్తర్ జిల్లాల్లో దాదాపు వేయి మంది సాధారణ ఆదివాసీ ప్రజల ఊచకోత, 664 ఆదివాసీ గ్రామాల దహనం, 60 వేల మంది ఆదివాసీ ప్రజలు నిర్వాసితులు కావడం, 2005 ఫిబ్రవరిలో ఉత్తర తెలంగాణలో నిజామాబాద్ జిల్లా మానాల కోవర్టు ఆపరేషన్‌లో 10 మంది విప్లవ కార్యకర్తల హత్య, 2006 నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్‌లో బద్వేల్ కోవర్టు ఆపరేషన్‌లో 9 మంది విప్లవ కార్యకర్తల హత్యతో సహా అనేక కోవర్టు హత్యలు, 2008 ఫిబ్రవరిలో ఝూర్ఖండ్‌లోని తూర్పు సింఘ్‌భూం జిల్లాలో భీతర్‌ఆమ్దా కోవర్టు ఆపరేషన్‌లో 9 మంది విప్లవ కార్యకర్తల ఊచకోత, మార్చిలో కంచాల్ కోవర్టు ఆపరేషన్ (బీజాపూర్ జిల్లా, దండకారణ్యం)లో 18 మంది విప్లవ కార్యకర్తల ఊచకోత, 2009 నుంచి ప్రారంభమైన ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో భాగంగా లాల్‌గఢ్ ప్రాంతంలో దాదాపు 130 మంది ఆదివాసీ ప్రజల ఊచకోత, దండకారణ్యంలో 250 మందికి పైగా ఆదివాసీ ప్రజల ఊచకోత, బీహార్‌లోని జముయిా జిల్లాలో 2010 జనవరిలో ఫుల్‌వరీయా కొడాసీలో 8 మంది విప్లవ కార్యకర్తల ఊచకోత, అదే జిల్లాలో సెప్టెంబర్‌లో గంగానది ఒడ్డున 10 మంది విప్లవ కార్యకర్తలపై విషప్రయోగం-హత్య, తాజాగా 2012 జూన్ 28న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా (దండకారణ్యంలో) 'బాసగూడ-సార్కిన్‌గూడ మారణకాండ'లో 20 మంది ప్రజల ఊచకోత - ఇలా పదుల సంఖ్యలో సాగిన మారణకాండలు 'అంతర్గత ముప్పు'ను రూపుమాపే పేరుతో భారత పాలకవర్గాలు ప్రజలపై సాగిస్తున్న యుద్ధానికి తిరుగులేని నిదర్శనాలు.

అయితే ఇక్కడ ప్రతి ఒక్కరూ గమనించాల్సిన అంశం ఏమిటంటే ఆపరేషన్ గ్రీన్ హంట్ కేవలం మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలకు పరిమితమైనది కాదు. ఇది కార్పొరేట్ దోపిడికి అడ్డు నిలిచిన ప్రతి వ్యక్తినీ, ప్రతి సంస్థను తన శత్రువుగా పరిగణిస్తుంది. 'రెడ్ కారిడార్' అని చెబుతున్న పశ్చిమ బెంగాల్, ఝూర్ఖండ్, బీహార్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలతో కూడిన విశాల ప్రాంతాన్ని 'కార్పొరేట్ కారిడార్'గా మార్చడం, దీనికి అడ్డువచ్చే వాళ్లందరినీ 'సర్వం విధ్వంసం' చేయడం దాని లక్ష్యం. అందుకే దేశంలో అనేక మంది ప్రజాస్వామికవాదులు ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను 'ప్రజలపై యుద్ధం'గా అభివర్ణిస్తున్నారు. ఈ ఆపరేషన్ గ్రీన్ హంట్ లేదా 'ప్రజలపై యుద్ధాని'కి జవాబు ప్రజాయుద్ధమేననేది స్పష్టం. అంటే ప్రజా పోరాటాలను, ప్రజా రాజ్యాధికారం కోసం సాగే సాయుధ పోరాటంతో సమన్వయించడం ద్వారా, ప్రజల ప్రయోజనం కోసమే ప్రజాయుద్ధమని ప్రజలకు అర్థం చేయించి, వారిలోని సృజనాత్మక శక్తిని ధైర్యసాహసాలను వెలికి తీయడం ద్వారానే జవాబు చెప్పాలి. ప్రజాయుద్ధం ద్వారా తప్ప మరో మార్గంలో ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను అడ్డుకోవడం, ఓడించడం సాధ్యం కాదు.

అందుకే మనం ప్రజాయుద్ధం అంటే, ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు లక్ష్యంగా మారిన అన్ని రకాల వర్గాలు, సెక్షన్లు సమైక్యమై కార్మికవర్గ పార్టీ నాయకత్వంలో సామ్రాజ్యవాదులకూ, వారి కార్పొరేట్ కంపెనీలకు, వారికి సాగిలపడిన ఈ దేశ భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ పాలకవర్గాలకూ వ్యతిరేకంగా సాగించే యుద్ధం అని నిర్వచిస్తున్నాం. ప్రజాయుద్ధం తన లక్ష్యాన్ని సాధించాలంటే 'సాయుధ పోరాటం ప్రధాన పోరాటం రూపంగా, ప్రజా సైన్యం ప్రధాన నిర్మాణం రూపంగా' ఉంటుందనేది మావోయిస్టు సూత్రం. కనుక, వ్యూహాత్మక ప్రాంతాల్లోని గెరిల్లాజోన్లలో, ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలలో మన పార్టీ నాయకత్వంలో ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం సాగించే గెరిల్లా యుద్ధం ప్రజాయుద్ధంలో ప్రముఖ భూమికను పోషిస్తుంది. ప్రజాపునాది బలంగా లేకుండా గెరిల్లా యుద్ధం సాగించడం సాధ్యం కాదు. ఇందుకోసం సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల కాళ్ల కింద నలిగి పోతున్న పీడిత ప్రజారాశులను మేల్కొల్పుతూ కార్మిక-కర్షక మైత్రి పునాదిపై, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలతో కూడిన నాలుగు వర్గాల ఐక్యసంఘటన నిర్మించేందుకు మనం కృషి చేస్తున్నాం. చట్టబద్ధ-చట్ట వ్యతిరేక, సాయుధ-సాయుధేతర ప్రజా పోరాటాలను, దైనందిన, రాజకీయ, హక్కుల పోరాటాలను, బహిరంగ, రహస్య పద్ధతుల్లో చేపడుతున్నాం. పీడిత ప్రజలు అనేక రూపాలలో తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఈ పోరాటాలన్నింటినీ ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా సాగేలా, దోపిడి పాలకవర్గాల పాలనను కూలదోసి రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే సాయుధ పోరాటంతో సమన్వయించి కొనసాగించేలా మన పార్టీ కృషి చేస్తున్నది.

**ప్రశ్న 2 : ప్రభుత్వం మావోయిస్టుల తిరుగుబాటును ఎదుర్కోవడానికి ఎల్.ఐ.సి. విధానాన్ని ఉపయోగిస్తున్నది. ఈ ప్రభుత్వ వ్యూహానికి మీ జవాబు ఏంటి?**

**బి.ఆర్. :** అమెరికా సామ్రాజ్యవాద నిర్దేశిత తక్కువ తీవ్రత కలిగిన యుద్ధ వ్యూహాన్ని (లో ఇన్‌టెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్ - ఎల్.ఐ.సి.) ప్రయోగించి భారత దోపిడి పాలకవర్గాలు మన పార్టీ నాయకత్వంలో సాగుతున్న విప్లవోద్యమాన్ని రూపుమాపేందుకు మొత్తం రాజ్య యంత్రాంగాన్ని కేంద్రీకరిస్తున్న మాట వాస్తవం. ఈ విషయం రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజాస్వామికవాదు లందరికీ తెలిసిందే. సామ, భేద, దాన, దండోపాయాలను వుపయోగించి శత్రువును దెబ్బతీయాలనే ఫ్యూడల్ రాజనీతికి సామ్రాజ్యవాద నయా వలసవాద రూపమే ఎల్.ఐ.సి. తప్ప మరొకటి కాదు. ఇందులో న్యాయానికి తావు లేదు. శత్రువును (పాలకవర్గాలకు శత్రువులంటే కార్మిక-కర్షక, మధ్యతరగతి, జాతీయ బూర్జువాలతో కూడిన నాలుగు వర్గాలకు ప్రాతినిధ్యం వహించే మావోయిస్టులన్నమాట) నిర్మూలించడమే దీని లక్ష్యంగా ఉంటుంది. కౌంటర్ ఇన్‌సర్జెన్సీకి చెందిన ఈనాటి సిద్ధాంతమే అమెరికా సామ్రాజ్యవాదులు రూపొందించిన ఎల్.ఐ.సి. వ్యూహం.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచంలోని వలస-అర్ధవలస దేశాల పీడిత జాతులు, ప్రజలు కొనసాగిస్తున్న న్యాయమైన పోరాటాలకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు రూపొందించి ఎక్కుపెట్టిన విప్లవ ప్రతీఘాతుక సిద్ధాంతమే ఎల్ఐసి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సామ్రాజ్యవాదులు - ఫ్రెంచి సామ్రాజ్యవాదులు ఇండోచైనా, అల్జీరియాలలో; బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పాలస్తీనా, సైప్రస్, మలేషియాలలో; అమెరికా సామ్రాజ్యవాదులు ఇండోచైనాలో, ప్రత్యేకించి వియత్నాంలో విప్లవాలను ఎదుర్కోవడంలో చవిచూసిన ఓటముల నుంచి గుణపాఠాలు నేర్చుకొని, దీర్ఘకాల ప్రజాయుద్ధాలకూ, జాతీయ విముక్తి ఉద్యమాలకు వ్యతిరేకంగా రూపొందించిన విప్లవ ప్రతీఘాతుక యుద్ధ విధానమే ఎల్.ఐ.సి. వ్యూహం. విప్లవ సంస్థల నాయకత్వంలో ప్రజలు రాజకీయంగా సమీకృతం కాకుండా, సంఘటితపడకుండా, సాయుధమై పోరాడకుండా ఇది ప్రజలను పక్కదారి పట్టిస్తుంది. మరోమాటలో చెప్పాలంటే, న్యాయమైన విప్లవ యుద్ధాలను చిన్నాభిన్నం చేయడం, ఈ విప్లవ యుద్ధాలకు పునాదిగా, అండగా ఉన్న ప్రజలను అణచివేసి వారిని లొంగదీసుకోవడమే ఎల్.ఐ.సి. లక్ష్యం. ఈ వ్యూహాన్ని రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ, సైనిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలన్నింటా తక్షణ, దీర్ఘకాల పథకాలతోనూ; బహిరంగంగానూ, రహస్యంగానూ; ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ; సాయుధంగానూ, సాయుధేతరంగానూ మోసపూరితంగా అమలు చేస్తున్నారు. విప్లవోద్యమాలను ఎదుర్కోవడంలో సామ్రాజ్యవాదులు, వారి నమ్మినబంట్లయిన భారత పాలకవర్గాలు సాగించే మోసాలకు, కుట్రలకు-కూహకాలకు అంతు ఉండదు. అందువల్లనే మనం దీనిని అత్యంత మోసపూరితమైన, ప్రతీఘాతుకమైన, క్రూరమైన, విధ్వంసకరమైన విధానం అంటున్నాం.

రెండవ ప్రపంచ యుద్ధంలో సామ్రాజ్యవాదం గణనీయంగా బలహీనపడింది. వలసలపై సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష పాలన స్థానంలో పరోక్ష పాలనా విధానం, వలస విధానం స్థానంలో నయా వలస విధానం ఒక సాధారణ లక్షణంగా మారింది. అర్ధవలస దేశాల్లో ఫ్యూడల్ వ్యతిరేక ప్రజాస్వామిక విప్లవాలు, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ ప్రజాస్వామిక విప్లవాలు పరిపూర్తి కాకుండానే స్వాతంత్ర్యం ముసుగులో సామ్రాజ్యవాదులతో కుమ్మక్కైన, వారి పెంపుడు కుక్కలైన దేశీయ బడా భూస్వాములు, దళారీ పెట్టుబడిదారులు అధికారం కైవసం చేసుకొని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముసుగులో నిరంకుశ పాలన సాగిస్తూ నయా వలస దోపిడికి పునాదిగా నిలిచారు. అదే సమయంలో మావోయిజం మార్క్సిజం-లెనినిజం యొక్క ఉన్నత దశగా, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం వలస, అర్ధవలస దేశాల విముక్తి మార్గంగా ప్రపంచ కార్మికవర్గంచే, పీడిత ప్రజలచే గుర్తింపు పొందింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై, అగ్రరాజ్యంగా పతనమవడంతో అమెరికా ప్రపంచ పోలీసుగా, పీడిత జాతులకు, ప్రజలకు, విప్లవోద్యమాలకు నెంబర్ వన్ శత్రువుగా ముందుకు వచ్చింది. ప్రపంచ పెట్టుబడిదారీ విధానం సంక్షోభాల

నెదుర్కొంటున్న కొద్దీ నయా ఉదారవాద ఆర్థిక విధానాలతో సహా అది చేపట్టిన చర్యలన్నీ విఫలమై ప్రపంచ వ్యాపిత తీవ్ర సంక్షోభ సుడిగుండంలో పడి కొట్టుమిట్టాడుతున్నది. అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశాల స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, ప్రజాస్వామ్యం బండారం బట్టబయలవుతూ ఈ దేశాల పాలకులు సామ్రాజ్యవాదుల దళారీలుగా, కీలుబొమ్మలుగా, ప్రజా పీడకులుగా ప్రజాస్వామ్యానికి, ప్రగతికి, స్వాతంత్ర్యానికి, సార్వభౌమత్వానికి, స్వావలంబనకు బద్ధ శత్రువులుగా, ప్రజా ఉద్యమాలన్నింటికి ప్రధాన అడ్డంకిగా బహిర్గతమై పోతున్నారు. పలు దేశాల్లో మావోయిస్టు పార్టీలు దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాని చేపట్టి ప్రజా సైన్యాలను నిర్మించుకొని సుదీర్ఘకాలంగా గెరిల్లా యుద్ధం కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సామ్రాజ్యవాదుల నయా వలస దోపిడిని కొనసాగించేందుకు, ఎటువంటి సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలనైనా, విప్లవోద్యమాలనైనా, జాతి విముక్తి తిరుగుబాట్లనైనా అణచివేసేందుకూ, లొంగదీసుకునేందుకూ సామ్రాజ్యవాదుల బహుముఖ వ్యూహంగా ఎల్.ఐ.సి. రూపుదిద్దుకుంది.

అమెరికా ఆర్థిక వ్యవస్థ యుద్ధాలపై ఆధారపడిన వ్యవస్థ. ఆయుధాలు, యుద్ధ టెక్నాలజీ, యుద్ధ విమానాలు, యుఏవిలు, యుద్ధ సామ్రాగిని అమ్ముకోవడం ద్వారానే అది ఇంకా బతికి బట్ట కడుతోంది. యుద్ధాలు ఆగిపోయిన మరుక్షణం అది కుప్పకూలిపోతుంది. ఎల్ఐసి వ్యూహం అమలు చేస్తున్న దేశాలన్నింటిలోనూ సామ్రాజ్యవాదులు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, పౌర, పరిపాలక, న్యాయ, సైనిక భాగాలూ, యంత్రాంగాలన్నిటినీ అతివేగంగా ఫాసిస్టీకరిస్తున్నారు. ఇందులో భాగంగానే మన దేశంలో ప్రజాయుద్ధాన్నీ, న్యాయమైన కాశ్మీర్, ఈశాన్య జాతుల విముక్తి ఉద్యమాలను చిన్నాభిన్నం చేసి ప్రజలను లొంగదీసుకునే దుష్టతలంపుతో పాలకవర్గాలు చాలా వేగంగా ప్రత్యేక పోలీసు, పారామిలటరీ, మిలటరీ బలగాలను పెద్ద సంఖ్యలో తయారు చేస్తున్నాయి. కేంద్ర-రాష్ట్ర ప్రత్యేక ఇంటెలిజెన్స్ విభాగాలను నిర్మించుకుంటున్నాయి. యావత్తు పౌర-సైనిక విభాగాలను కేంద్రీకరిస్తున్నాయి. ప్రజల దృష్టిని మౌలిక సమస్యల నుండి, విప్లవకర మౌలిక పరిష్కార మార్గం నుండి బూటకపు సంస్కరణలు, బూటకపు అభివృద్ధి, కపట శాంతి వైపు మళ్లించడానికి మానసిక యుద్ధాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. ప్రత్యేక బలగాలను వినియోగించి కౌంటర్-ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్ పేరుతో అమానుష హత్యాకాండలను, విధ్వంసకాండలను ఎంత తీవ్రంగా కొనసాగిస్తున్నాయో, అంతే తీవ్రంగా మానసిక యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. దేశంలో వీటిని ఎంత విస్తృతంగా తీవ్రంగా కొనసాగిస్తున్నారో, ఆంతరంగికంగా నిరంకుశత్వంతో పాటు సామ్రాజ్యవాదుల అదుపు అంత విస్తృతంగా తీవ్రంగా పెరిగిపోతున్నాయి. వీటి వల్ల దేశంలోని పీడిత జాతులపై, ప్రజలపై దోపిడీ పీడనలు అంతే విస్తృతంగా, తీవ్రంగా పెరిగిపోతున్నాయి. మరొకవైపున తీవ్రతరమవుతున్న ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక, రాజకీయ సంక్షోభం మన దేశాన్ని అన్ని రంగాల్లో పట్టి కుదిపివేస్తున్నది. దళారీ పాలకుల పాలనలో దేశం మున్నెన్నటికంటే పతనమవుతున్నది, పరాధీనమైపోతున్నది.

1991 నుంచి భారత పాలకులు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐ.ఎం.ఎఫ్.), ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి సామ్రాజ్యవాద సంస్థల నుంచి తెచ్చిన, తెస్తున్న వందల బిలియన్ల డాలర్ల అప్పులతో (ఒక బిలియన్ డాలర్లు అంటే దాదాపు 5,500 కోట్ల రూపాయలు) మన దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయే రోజు సమీపిస్తోంది. సరిగ్గా దీని వల్లనే ఇండోనేషియా, అర్జెంటీనా, ఉరుగ్వే, మెక్సికో, పెరూ వంటి దేశాల ఆర్థిక వ్యవస్థలు కూడా అప్పుల సంక్షోభంలో కూరుకుపోయి చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దివాలా తీయడం, నిరుద్యోగం, కొనుగోలు శక్తి పడిపోవడం, అధిక ధరలతో కుప్పకూలిపోయాయి. ఇదే అనుభవం మన దేశంలో కూడా పునరావృత్తం కానున్నది. ఈ విషయం తెలిసి కూడా 2030 నాటికి మన దేశం సూపర్ పవర్ కాబోతోందని సామ్రాజ్యవాద మేధో ప్రపంచం, మన దేశ దళారీ పాలకవర్గాలు ప్రచారం చేస్తున్నాయి. చైనాకు పోటీగా తమ జూనియర్ పార్టనర్‌గా కలుపుకోవాలని చూస్తున్నాయి. దీనికి అనుగుణంగా ప్రజల మెదళ్లను మలచడం కోసం తిమ్మిని బమ్మి చేసే విధంగా (సంక్షోభంలో కూరుకుపోతున్న దేశాన్ని సూపర్ పవర్‌గా అభివృద్ధి చెందే దేశంగా) ప్రజలపై మానసిక యుద్ధం సాగించేందుకు సామ్రాజ్యవాదులు బిలియన్ల కొద్ది డాలర్లను వెచ్చించి మానసిక శాస్త్రవేత్తల ద్వారా మైండ్ కంట్రోల్ మాన్యువల్స్‌ను తయారు చేయిస్తున్నారు. నిజానికి లక్షాధికారులు, కోటీశ్వరులు తప్ప సాధారణ ప్రజలు దారుణ ఆర్థిక సంక్షోభంలో పడి కొట్టుమిట్టాడుతున్నారు. ఫలితంగా దేశంలో ప్రముఖ, మౌలిక, ప్రధాన వైరుధ్యాలతో పాటు అన్ని సామాజిక వైరుధ్యాలు తీవ్రతరమవుతున్నాయి. సామ్రాజ్యవాదులు, దళారీ పాలకులు ఎల్.ఐ.సి. వ్యూహం ద్వారా ఆశిస్తున్న దానికి భిన్నంగా, వారి విప్లవ ప్రతీఘాతుక ఎల్ఐసి విధానాన్ని తిప్పికొడుతూ ఈ విధానం అంతిమంగా విఫలం కాకతప్పదని, ప్రజల విజయం అనివార్యమని రుజువు చేసేలా మన దేశంలో మన పార్టీ సి.పి.ఐ. (మావోయిస్టు) నాయకత్వంలో ప్రజాయుద్ధం ఆటుపోట్లను ఎదుర్కొంటూనే అభివృద్ధి చెందుతున్నది. జాతుల ఉద్యమాలు సైతం ఆటుపోట్లను ఎదుర్కొంటున్నప్పటికీ నిరంతరం రగులుతూనే ఉన్నాయి. దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారా ఎల్.ఐ.సి.ని ఓడించడం సాధ్యమని ఇదంతా రుజువు చేస్తున్నది.

సామ్రాజ్యవాద ఎల్.ఐ.సి. వ్యూహాన్ని గురించి సవివరంగా చర్చించిన మన పార్టీ కేంద్రకమిటీ ఎల్.ఐ.సి.ని తిప్పికొట్టేందుకు, ఓడించేందుకూ 2008 డిసెంబర్‌లో ఒక పాలసీని రూపొందించింది. అందులో పేర్కొన్న విధంగా సిద్ధాంత, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సైనిక విషయాలపై కేంద్రీకరించి పనిచేయడం ద్వారా ఎల్.ఐ.సి.ని ఓడించగలుగుతామని మనం విశ్వసిస్తున్నాం.

ఇందుకు గాను మనం మన పార్టీ రాజకీయ పంథా విషయంలో, దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో విప్లవోద్యమాన్ని విజయవంతంగా పురోగమింపజేసే మిలటరీ వ్యూహం విషయంలో దృఢంగా ఉన్నాం. ఎత్తుగడల విషయంలో పట్టువిడుపులతో పనిచేస్తున్నాం. ప్రజాయుద్ధంలో కోట్లాది

పీడిత ప్రజల క్రియాశీల పాత్రను పెంపొందించడానికి వర్గపోరాటంలో విస్తృతంగా కదిలించడంతో పాటు మార్క్సిజం–లెనినిజం–మావోయిజంతో ఎడ్యుకేట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందుకు ఆటంకంగా నిలుస్తున్న సంస్కరణవాదం, ఆర్థికవాదం, రివిజనిజం, గాంధీయిస్టు శాంతివాదం, పోస్టుమాడర్నిజం, కుహనా ప్రజాస్వామ్యం, బూటకపు స్వాతంత్ర్యాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేస్తూ ఈ అవగాహనను ప్రజల్లోకి తీసుకెళుతున్నాం.

ప్రజాపునాదిని విస్తృతం, పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నాం. వర్గపంథా, ప్రజాపంథాలకు దృఢంగా అంటిపెట్టుకొని ఉంటూ ప్రజలను రాజకీయంగా సమీకరించి ప్రజాయుద్ధంలో భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తున్నాం. పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల ప్రజలను రాజకీయంగా, సమీకృతం చేస్తూ విశాల సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ఐక్యసంఘటనను నిర్మించడానికి ప్రయత్నిస్తున్నాం. గెరిల్లా యుద్ధాన్ని విస్తృతం–తీవ్రతరం చేస్తూ, దేశవ్యాప్తంగా ప్రజాయుద్ధాన్ని విస్తరింపజేసే దృక్పథంతో పనిచేస్తున్నాం. మావోయిస్టు ప్రజాయుద్ధాన్ని దెబ్బతీసేందుకు ఎల్ఐసిలో భాగంగా పెద్దయెత్తున దోపిడీ పాలకవర్గాలు సాగిస్తున్న మానసిక యుద్ధాన్ని–దుష్ప్రచారాన్ని మన పార్టీ విప్లవ ప్రచారం ద్వారా తిప్పికొట్టేందుకు ప్రయత్నిస్తోంది. విప్లవోద్యమానికి సంబంధించిన వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచుతోంది.

**ప్రశ్న 3 : ప్రభుత్వం వద్ద అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉంది. ఉపగ్రహాలు, మానవ రహిత విమానాలు, జి.పి.ఎస్., అత్యాధునిక టెలి కమ్యూనికేషన్స్, కమ్యూనికేషన్ కంట్రోల్ వార్ రూం ఉన్నాయి. రేపో, మాపో రోబోలను ఉపయోగిస్తుంది. ఈ హైటెక్ శత్రువును మీరు ఎలా ఎదుర్కొంటారు?**

బి.ఆర్. : 1956 జూలై 14న ఇద్దరు లాటిన్ అమెరికా ప్రజా ప్రముఖులతో మాట్లాడుతూ కామ్రేడ్ మావో ఇలా అన్నారు, 'అమెరికా సామ్రాజ్యవాదం చాలా శక్తివంతమైనది. కానీ, వాస్తవంలో అది శక్తివంతమైనది కాదు. అది ప్రజా బాహుళ్యం నుండి వేరుపడి ఉండి ప్రతివొక్కరి చేత, ఆఖరికి అమెరికా ప్రజల చేత కూడా అసహ్యించుకోబడి ఉంది. కాబట్టి రాజకీయంగా అది చాలా బలహీనంగా ఉంది. చూపులకు అది చాలా శక్తివంతమైనదే, కానీ వాస్తవంలో దాన్ని చూసి భయపడనక్కరలేదు. అది ఒక కాగితపు పులి.

..... అమెరికా సామ్రాజ్యవాదం ఒక కాగితపు పులి అని మేమంటున్నప్పుడు మేము వ్యూహాన్ని దృష్టిలో పెట్టుకొని మాట్లాడుతున్నాం. మొత్తం మీద చూసినప్పుడు, దాన్ని మనం తప్పనిసరిగా చిన్నచూపు చూడాలి. కానీ ప్రతి ఒక్క భాగానికి సంబంధించి దాన్ని మనం తప్పక జాగ్రత్తగా పట్టించుకోవాలి. దానికి పంజాలు, కోరలు ఉన్నాయి. దాన్ని మనం ఒక్కొక్క ముక్కగా నాశనం చేయాలి. ఉదాహరణకు, దానికి పది కోరలుంటే, మొదటిసారి ఒక కోరనూడగొట్టు! తొమ్మిది మిగిలిపోతాయి. మరో దాన్ని ఊడగొట్టు! ఎనిమిది మిగిలిపోతాయి. అన్ని కోరలు ఊడిపోయిన

తర్వాత దానికింక పంజాలు మిగిలి ఉంటాయి.

..... నేడు అమెరికా ఇంకా బలంగా ఉంది. సంవత్సరానికి 10 కోట్ల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేస్తోంది. ప్రతీ చోటా దాడి చేస్తోంది. అందుకే మనం దానికి వ్యతిరేకంగా పోరాటం సల్పడం తప్పక కొనసాగించాలి. మన యావచ్ఛక్తితోనూ దానితో పోరాడి, దాని నుండి, ఒక స్థానం తర్వాత మరో స్థానాన్ని గుంజుకోవాలి. దానికి సమయం పడుతుంది.' (మావో ఏరిన రచనలు, 5వ సంపుటి, అమెరికా సామ్రాజ్యవాదం ఒక కాగితం పులి, పేజీలు 400వ పేజీ మొదటి పేరా, 5వ పేరా, 401వ పేజీ మొదటి పేరా చివరి ఐదు వాక్యాలు.)

పైన ఉదహరించిన మావో మహోపాధ్యాయుని మాటల్ని బట్టి ఏమర్థమవుతుంది? యుద్ధ ఫలితాలను నిర్ణయించేది ఆధునిక ఆయుధాలు, టెక్నాలజీ కాదనీ మానవుల చైతన్యయుత పాత్రనే యుద్ధంలో నిర్ణయాత్మకమైందిగా ఉంటుందనీ. ఎంతటి శక్తివంతమైన శత్రువు అయినప్పటికీ అతడు అభివృద్ధినిరోధకుడయినప్పుడు, ప్రజా వ్యతిరేకి అయినప్పుడు, అన్యాయమైన యుద్ధాన్ని అతడు ప్రజలపై రుద్దినప్పుడు, ప్రజల అసహ్యానికి అతను గురైనప్పుడు అతడు రాజకీయంగా చాలా బలహీనంగా ఉంటాడు. అతనికి వ్యతిరేకంగా నూటికి 90 మందిగా ఉన్న ప్రజలు ఒక్కటై నిలిచి సంఘటిత శక్తిగా మారడం ద్వారా శత్రువును తుదముట్టిస్తారు. నేడు భారత ప్రభుత్వం చాలా శక్తివంతమైన రాజ్యయంత్రాంగాన్ని కలిగి ఉందని అది మునుపెన్నటికన్నా రోజు రోజుకూ అనేక కోరల్ని పెంచుకుంటోందనేది స్పష్టం. దీనికి సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. భారత ప్రభుత్వాన్ని కూలదోయడం అంటే అంత తేలికైన పని కాదని కూడా మనకు తెలుసు. దీనికి లెక్కకు మించిన కోరలున్న మాట వాస్తవమే. కానీ, ఆనాటికి హైటెక్నాలజీని కలిగి ఉన్న అమెరికా సామ్రాజ్యవాదులకూ అనేక దురాక్రమణ యుద్ధాలలో ఎందుకు ఓటములను చవిచూడాల్సి వచ్చిందో ఈ సందర్భంగా మనం మననం చేసుకోవాల్సిన అవసరం ఉంది. 1965-75లలో అది వియత్నాంలో చావు దెబ్బతిన్నది. అయితే ఆనాడు విప్లవ, జాతీయ విముక్తి పోరాటాలకు 1950ల మధ్య వరకూ సోషలిస్టు శిబిరం, ఆ తర్వాత 1976 వరకూ సోషలిస్టు చైనాల అండదండలు లభించాయి. నేడు ప్రపంచంలో సోషలిస్టు దేశం అంటూ ఉనికిలో లేకపోయినప్పటికీ ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో సాగుతున్న జాతుల విముక్తి పోరాటాలు, నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా కొనసాగుతున్న అరబ్బు ప్రజావెల్లువలు, సామ్రాజ్యవాద దేశాలలో పెద్దయెత్తున పెంపొందుతున్న కార్మికవర్గ పోరాటాలు, కొన్ని దేశాలలో సాగుతున్న విప్లవోద్యమాలు, అమెరికా, బ్రిటన్ తదితర సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా కొన్ని దేశాలలో సాగుతున్న ఇస్లామిక్ గెరిల్లా సంస్థల సాయుధ పోరాటాలతో సామ్రాజ్యవాదులకు కునుకుపట్టడం లేదు. ఫలితంగా ఈ దశాబ్ద కాలంలో అమెరికా నాయకత్వంలో నాటో కూటమి ఇరాక్ నుంచి అది వెనుదిరగాల్సి వచ్చింది. రానున్న రెండు సంవత్సరాలలో ఆఫ్ఘనిస్తాన్ నుంచి

వెనుదిరగబోతోంది. దీనికి కారణం ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా వారు దురాక్రమణ యుద్ధాలకు దిగడమూ, మారణహోమం సృష్టించడం, దోపిడీ పీడనల ద్వారా ప్రజలను వీధుల పాల్జేయడం తప్ప మరొకటి కాదు. కనుక, నేడు ఒక్క సోషలిస్టు దేశం కూడా లేకపోయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా పెంపొందుతున్న అద్భుతమైన విప్లవ పరిస్థితి నెలకొని ఉంది. దీన్ని చాకచక్యంగా ఉపయోగించుకోగలిగితే విప్లవ శక్తులు అజేయంగా పురోగమించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఇదే విధంగా భారత పాలకవర్గాలు ప్రజలపై యుద్ధాన్ని, దోపిడి పీడనలను సాగించినంత వరకూ అమాయక ప్రజల ఊచకోత సాగించినంత వరకూ వారికి ఎంతటి శక్తివంతమైన, అధునాతన ఆయుధాలు ఉన్నప్పటికీ అవి యుద్ధంలో గెలవలేవు. ప్రజలను తమ వైపు గెలుచుకోలేవు. అయితే యుద్ధంలో ఎత్తుగడల రీత్యా చూసినప్పుడు శత్రువు బలసంపన్నుడనే విషయాన్ని ఈ సందర్భంగా మనం మర్చిపోవద్దు. ఈ అంశాన్ని ఇలాంటి ఇతర అంశాల్ని దృష్టిలో పెట్టుకొనే బలమైన అర్ధవలస, అర్ధభూస్వామ్య భారతదేశంలో విప్లవాన్ని విజయవంతం చేసేందుకు మన పార్టీ దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాని చేపట్టింది. మావో బోధించినట్లుగా ఒక్కొక్క ముక్కగా శత్రువును దెబ్బతీస్తూ అంతిమంగా శత్రువును కూలదోసే, గ్రామాలను విముక్తి చేస్తూ అంతిమంగా పట్టణాలను పట్టుకునే దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను మనం అనుసరిస్తున్నాం. శత్రువు ఉపయోగించే జిపిఎస్‌లు, యుఏవి/డ్రోన్‌లు, హెలికాప్టర్లు, శక్తివంతమైన స్కానర్లు తదితర అత్యాధునిక పరిజ్ఞానం నిజానికి శత్రువు ప్రచారం చేస్తున్నంత బలమైనవేమీ కావు. ఇదే సందర్భంగా మనం చెప్పదలుచుకున్న మరో విషయమేమంటే ఏ ఆయుధానికైనా విరుగుడు వుంటుంది. ఇది మార్క్సిజం మనకు నేర్పే మౌలిక అంశం. కత్తి యుద్ధంలో కత్తి నుంచి రక్షించుకోవడానికి డాలు పుట్టింది. ముష్టి యుద్ధంలో పంచ్ నుంచి రక్షించుకునేందుకు బ్లాక్ చేసుకునే ఎత్తుగడ పుట్టింది. శత్రువు చేసే అఫెన్సివ్ ఆపరేషన్స్ నుంచి రక్షించుకునేందుకు డిఫెన్సివ్ ఆపరేషన్స్ రూపొందించబడ్డాయి. యుద్ధ నౌకలను ధ్వంసం చేసేందుకు టార్పెడోలను రూపొందించారు. యుద్ధ విమానాలను/హెలికాప్టర్లను కూల్చడానికి యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌లు రంగంలోకి వచ్చాయి. నేడు అత్యంత శక్తివంతమైనవిగా చెప్పుకునే డ్రోన్‌లను పక్కదారి పట్టించడం 'స్పూఫింగ్' టెక్నిక్ ద్వారా సాధ్యమని అమెరికా మిలటరీ నిపుణులే ఈ మధ్య ప్రకటించారు. ఈ టెక్నిక్‌ను ఉపయోగించడం ద్వారానే ఇటీవల ఒక అమెరికా నిఘా యుఏవిని ఇరాన్ ఇంటెలిజెన్స్ తమ దేశంలోనే దానిని ల్యాండింగ్ అయ్యేలా చేసి స్వాధీనం చేసుకున్నది. యుద్ధ శాస్త్రాన్ని అధ్యయనం చేసిన వారు ఎవరైనా ఆయుధాలను చూసి బెదిరిపోరు. ప్రత్యేకించి కార్మికవర్గ సైనిక సిద్ధాంతంగా 20వ శతాబ్దంలో ప్రాచుర్యం పొందిన మావోయిస్టు ప్రజాయుద్ధ సిద్ధాంతంతో సాయుధమైన మా పార్టీ ఎన్నటికీ బెదిరిపోదు. అభివృద్ధినిరోధకులు వేసే ప్రతి ఎత్తుగడకూ వ్యతిరేకంగా ప్రజలు కౌంటర్ ఎత్తుగడను వేయడంలో

సమర్థులని చరిత్ర పదే పదే రుజువు చేసింది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిస్టు హిట్లర్ సోవియట్ రష్యాను దురాక్రమిస్తే, సోవియట్ ప్రజానీకం ఒక్క తాటిన నిలబడి 2 కోట్ల మంది విప్లవ ప్రజల, కమ్యూనిస్టుల ఆత్మబలిదానాల ద్వారా హిట్లర్ సేనల్ని తరిమికొట్టడం జరిగింది. అంతేకాని, తమ వద్ద అత్యాధునికమైన అణుబాంబు ఉందని విర్రవీగిన అమెరికా సామ్రాజ్యవాదులు హిట్లర్‌ను ఓడించడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించలేకపోయారు. అందుకే అంటున్నాం - ప్రజాయుద్ధంలో టెక్నాలజీ కాదు ప్రజలే నిర్ణయాత్మకమైన శక్తులు. ప్రజా వెల్లువలో శత్రు ఆధునిక టెక్నాలజీ ధ్వంసం చేయబడుతుంది లేదా నిర్వీర్యం చేయబడుతుంది. ప్రజలు విప్లవతత్వంతో ప్రజాయుద్ధంలో భాగస్వాములైతే విప్లవ పార్టీ నాయకత్వంలో కార్మిక-కర్షక, తదితర పీడిత ప్రజలు ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకొని నూతన ఎత్తుగడలను సృజనాత్మకంగా సృష్టిస్తూ శత్రువుతో ధీటుగా తలపడగలరు. శత్రువు ప్రయోగించే ప్రతీఘాతుక ఎత్తుగడలను తిప్పికొడుతూ, విప్లవోద్యమాన్ని కాపాడుకుంటూ శత్రువును ఓడించగలరు.

సామ్రాజ్యవాదులు వారి తాబేదార్ల వద్ద వున్న అత్యాధునిక పరిజ్ఞానాన్ని తిప్పికొట్టేందుకు మావోయిస్టు గెరిల్లా యుద్ధ నియమాలను (రహస్యం, వేగం, దృఢసంకల్పం) పట్టుదలతో పిఎల్‌జిఏ అమలు జరపాల్సి ఉంటుంది. పిఎల్‌జిఏ బలగాలు నిరంతరం చలనంలో ఉంటూ శత్రువు ఊహించని రీతిలో కదలికలను సాగించడం ద్వారా అత్యాధునిక టెక్నాలజీని విఫలం చేయాలి. ఇటీవలి కాలంలో సామ్రాజ్యవాదులు, వారి తాబేదార్లు యుఏవి/డ్రోన్లను ఉపయోగించడం పెరిగింది. ఆఫ్ఘనిస్తాన్‌లో వీటి ఆపరేషన్లను అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాయే స్వయంగా పర్యవేక్షిస్తున్నాడని చెబుతున్నప్పటికీ వీటిలో వందలాది మంది సాధారణ ప్రజలు బలవుతున్నారంటే ఎవరిపైన ఆ యుద్ధం జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. భారతదేశంలో మావోయిస్టు ప్రాంతాలపై వీటి వినియోగానికి సన్నాహాలు చేస్తున్నారు. డ్రోన్ల వినియోగానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే అనేక చోట్ల ప్రజలు ఉద్యమిస్తున్నారు. మన దేశంలో కూడా డ్రోన్ల వ్యతిరేక ప్రజా ఉద్యమాల్ని చేపట్టాల్సిన అవసరం ఉంది. ఏదిఏమైనా, ప్రజలను రాజకీయంగా సంఘటితం చేయడం ద్వారా బలసంపన్నుడైన శత్రువును ఓడించగలమనే విశ్వాసం మనకు ఉంది.

**ప్రశ్న 4 : గత సంవత్సరానికి పి.ఎల్.జి.ఏ. 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ దశాబ్ద కాలంలో పి.ఎల్.జి.ఏ. సాధించిన విజయాలను సంక్షిప్తంగా వివరించండి.**

బి.ఆర్. : 2010 డిసెంబర్ 2 నాటికి ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పి.ఎల్.జి.ఏ.) ఆవిర్భవించి ఒక దశాబ్ద కాలం పూర్తయ్యింది. పిఎల్‌జిఏ ఆవిర్భావం చారిత్రాత్మకమైందని ఈ దశాబ్ద కాలంలో రుజువైంది. ఇలాంటి ప్రజాసైన్య నిర్మాణం భారతదేశ చరిత్రలో మునుపెన్నడూ

లేదు. కార్మికవర్గ నాయకత్వాన, కార్మిక–కర్షక మైత్రి పునాదిగా పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలను కలుపుకుంటూ ప్రజాపునాదితో పిఎల్‌జిఏ పురోగమించిన కాలమిది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఎర్రసైన్యంలో ఒక డిటాచ్‌మెంట్‌గా ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో, అందులో భాగంగా భారతదేశంలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం కోసం సిపిఐ (మావోయిస్టు) నాయకత్వంలో పిఎల్‌జిఏ కృషి చేస్తున్నది. ఇది ఈ దశాబ్దకాలంలో అనేక విజయాలు సాధిస్తూ చారిత్రకంగా తన వంతు పాత్రను నిర్వర్తించే శక్తిసమర్థతలను క్రమక్రమంగా అభివృద్ధి చేసుకుంటోంది. పిఎల్‌జిఏ సాధించిన విజయాలు ఇవి :

- ☆ కేంద్ర, రాష్ట్ర/స్పెషల్ ఏరియా/స్పెషల్ జోన్ మిలటరీ కమీషన్లు; రీజినల్, జోనల్/డివిజనల్/జిల్లా, ఏరియా స్థాయిలో మిలటరీ కమాండ్లు, పంచాయితీ, ఏరియా స్థాయిలో ప్రజా మిలీషియా కమాండ్లు ఏర్పడడం.
- ☆ ఒకదానిపై మరొకటి పరస్పరం ఆధారపడి పనిచేసే మూడు బలగాల నిర్మాణంగా పిఎల్‌జిఏ నిర్మాణం కావడం – ప్రధాన, ద్వితీయ, పునాది బలగాలు.
- ☆ పిఎల్‌జిఏ రిక్రూట్‌మెంట్‌కు ఊటచెలిమె లాగా ప్రజా మిలీషియా నిర్మాణాలు అభివృద్ధి చెందడం.
- ☆ ప్రజాయుద్ధాన్ని ప్రజాపోరాటాలతో సమన్వయించడం. ప్రజా పోరాటాలకు, ప్రజా ఉద్యమాలకు పిఎల్‌జిఏ దన్నుగా నిలబడడం. ఉదాహరణకు పశ్చిమ బెంగాల్‌లో సింగూర్, నందిగ్రామ్, లాల్‌గఢ్; ఒడిషాలో నారాయణపట్నా, కళింగనగర్ తదితర పోరాటాలకు; ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ బాక్సైట్; మహారాష్ట్రలో సూర్జాగఢ్; ఝార్ఖండ్‌లో వివిధ గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాటాలకు; ఛత్తీస్‌గఢ్‌లో లోహండిగూడా, రావ్‌ఘాట్, పల్లెమాడి, బోధ్‌ఘాట్ తదితర విస్థాపన వ్యతిరేక పోరాటాలకు.
- ☆ 2000 డిసెంబర్ 2న బీజప్రాయంగా ఏర్పడిన పిఎల్‌జిఏ క్రమక్రమంగా విస్తరిస్తూ కంపెనీలు, బెటాలియన్ల స్థాయికి అభివృద్ధి అవుతూ, విద్య, వైద్య, సాంకేతిక (టెక్నికల్), సమాచార (కమ్యూనికేషన్స్), సరఫరా (సప్లై), ఇంటెలిజెన్స్, మిలటరీ ఇన్‌స్ట్రక్టర్ టీములు, గార్డు యూనిట్లతో విస్తరిస్తూ పిఎల్‌ఏ వైపుగా (రెగ్యులర్ సైన్య నిర్మాణం వైపుగా) అడుగులు వేయడం.
- ☆ కలిమెల, శ్రీశైలం–సుండిపెంట, గఢవా, జగ్‌పురా, బాలాగంజ్, యల్లమంద, ఉప్పలాడ, బారా, లాదిపూర్–సాహుగంజ్, చంద్రపురా, సరండా–1, జప్‌లా, కోరాపుట్,

సరండా-2, చందోలి, గిరిడి, జహనాబాద్, ఆర్.ఉదయగిరి, ఎన్ఎండిసి, రాణిబోదిలి, బొకారో, కిరిబురు, గోయిల్‌కేరా, నయాగఢ్, ఝూర్ఝూ, లఖీసరాయ్, ఉర్పల్‌మెట్ట, తాడిమెట్ల-1, తోంగూడ, బట్టిగూడ, మర్కనార్, టవ్వెటోలా, మదనవేడ, లహిరి, ముకరం-తాడిమెట్ల-2, కొంగెర, కజరా, మమాయిల్, సరండా ప్రతిఘటన (2010) వంటి వందలాది ఎత్తుగడల ఎదురుదాడులలో పదుల సంఖ్యలో నడిచిన క్యాంపెయిన్లలో శత్రువు చేపట్టిన అనేక దాడి క్యాంపెయిన్లను ఓడించడం, అంతేకాక 2 వేల మంది శత్రు బలగాలను నిర్మూలించి, 2,500 ఆయుధాలను, లక్షకు పైగా తూటాలను స్వాధీనం చేసుకోవడం, వందలాది మంది భూస్వాములను, ప్రజా శత్రువులను, అభివృద్ధి నిరోధకులను, శత్రు ఏజెంట్లను, ఇన్‌ఫార్మర్లను, కోవర్టులను, సల్వాజుడుం, సేంద్ర, నాగరిక్ సురక్షా సమితి, భూమిసేన వంటి వివిధ విప్లవ ప్రతీఘాతుక ప్రైవేట్ సైన్యాలు, సోషల్ ఫాసిస్టు హర్మద్‌వాహిని, శాంతిసేన గూండాలు, గూండా నాయకులు, వివిధ బూర్జువా, రివిజనిస్టు పార్టీలకు చెందిన క్రూరమైన రాజకీయ నాయకులు మట్టిగరవడం.

☆ వ్యూహాత్మక ప్రాంతంలో శత్రు అధికారాన్ని ధ్వంసం చేసిన చోట పంచాయితీ, ఏరియా, జిల్లాస్థాయి విప్లవ ప్రజా కమిటీల నిర్మాణానికి పిఎల్‌జిఏ ఒక అద్భుతమైన సాధనంగా తోడ్పడడం.

☆ రాజకీయ, నిర్మాణ, ప్రచార, రక్షణ, ఉత్పత్తి కర్తవ్యాల నిర్వహణ కోసం ప్రధాన సాధనంగా తోడ్పడడం.

☆ అంతర్జాతీయంగా, దేశీయంగా పీడిత-తాడిత ప్రజలకు, పీడిత జాతులకు భారతదేశపు ఎర్రసైన్య డిటాచ్‌మెంట్ - పిఎల్‌జిఏ ఒక ఆశాదీపంగా నిలవడం.

☆ ఆకాశంలో సగమైన మహిళా లోకాన్ని మేల్కొల్పి, పోరాటంలో తమ సగభాగాన్ని తాము స్వంతం చేసుకునే వైపుగా రాజకీయ, నిర్మాణ, సైనిక, సాంస్కృతిక తదితర రంగాలన్నిటా వారిని అభివృద్ధి చేయడం, శ్రామిక మహిళా స్వావలంబనకు తోడ్పడడం.

**ప్రశ్న 5 : పోలీసు, పారా మిలటరీ బలగాలు ఒక వేళ మావోయిస్టులను ఎదుర్కోలేకపోతే సైన్యాన్ని దించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుంటున్నది. సైన్యాన్ని ఎలా ఎదుర్కుంటారు?**

**బి.ఆర్. :** భారత సైన్యం ఏ లక్ష్యంతో మన ప్రాంతాలకు వస్తోందనే దాన్నిబట్టి దాన్ని మనం ఎలా ఎదుర్కోగలం అనేది ఆధారపడి ఉంటుంది. సాయుధ బలగాలు (సైన్యం, పారామిలటరీ, స్పెషల్, పోలీసు బలగాలు), న్యాయ వ్యవస్థ, జైళ్లు, అధికార యంత్రాంగం వగైరాలతో కూడిన రాజ్య యంత్రాంగమే వాస్తవానికి రాజ్యం కార్యకలాపాలన్నింటిని

నిర్వహిస్తుంది. ఈ రాజ్య యంత్రాంగం ప్రధాన అంగం దాని సైనిక సాయుధ బలగాలే. అందుచేత సైన్యం రాజ్యానికే చెందుతుంది. ప్రపంచంలో ఒక రాజ్యానికి చెందని సైన్యమంటూ ఏదీ లేదు. కానీ అది ఏ రకమైన రాజ్యం? నేటి భారత రాజ్య యంత్రాంగం సామ్రాజ్యవాదానికి ఊడిగం చేసే దళారీ నిరంకుశాధికార బూర్జువా వర్గం, బడా భూస్వాముల దోపిడీ వర్గ పరిపాలనకూ, వర్గ అణచివేతకూ, వర్గ దోపిడీకి సాధనం. ఆ విధంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుంచి భారత దళారీ ప్రభుత్వానికి వారసత్వంగా లభించిన భారత సైన్యం కూడా విప్లవ ప్రతీఘాతుకమైనదే.

భారత రాజ్యాంగం ప్రకారం భారత సాయుధ బలగాల ప్రధాన విధి బయటి దేశాల దురాక్రమణకు గురికాకుండా దేశ సరిహద్దులను కాపాడడం, ప్రకృతి వైపరీత్యాలప్పుడు ప్రజలకు సేవ చేయడం కాగా, భారత ప్రభుత్వం తన సైన్యాన్ని తన స్వంత ప్రజలపైకే అనేక సార్లు వుసిగొల్పింది. భారత సైన్యం దేశ సరిహద్దుల్లో యుద్ధంలో పాల్గొన్నది కేవలం 143 రోజులేనని సైనికాధికారి ఒకరు అన్నారు. అంతర్గత భద్రత అనే ముద్దుపేరుతో అది దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసం మొట్టమొదట 'నైజాం నుంచి విముక్తి' సాకుతో తెలంగాణ ప్రజలపై యుద్ధం చేసింది (1948 సెప్టెంబర్ నుంచి 1951 అక్టోబర్ వరకు). ఆ తర్వాత ఈశాన్య రాష్ట్రాలను, కాశ్మీరును దురాక్రమణ చేసింది. 1971 జూలైలో బీర్‌భూం విప్లవ ప్రజల పోరాటంపై అణచివేత దాడి సాగించింది. అలాగే 1990లో పంజాబు ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా 'శిక్షణ' సాకుతో భారత సైన్యాన్ని సంపూర్ణంగా ఉపయోగించారు. ఈ క్రూరమైన అణచివేత క్యాంపెయిన్లలో ఈశాన్యంలో 30,000, కాశ్మీరులో 80,000, పంజాబ్‌లో 10,000 తెలంగాణ సాయుధ పోరాటంలో (1946–51) 5,000, బీర్‌భూమ్‌లో 200 మంది ప్రజలను, కార్యకర్తలను; యింకా పారామిలటరీ, పోలీసు, స్పెషల్ కమాండో బలగాలు నక్సల్బరీ, శ్రీకాకుళం నుంచి ఇప్పటి వరకూ సాగించిన హత్యాకాండలలో మావోయిస్టు ఉద్యమంలో అసువులు బాసిన 13,000 మందితో కలుపుకుంటే లక్షల మంది స్త్రీ, పురుషులను ప్రభుత్వ సాయుధ బలగాలు ఊచకోత కోశాయి. లక్షలాది మందిని చిత్రహింసలకు గురిచేసి జైళ్లలో బంధించాయి. కోట్లాది రూపాయల ప్రజల ఆస్తులను కొల్లగొట్టాయి, తగులబెట్టాయి. వేలాది మంది యువతీ యువకులను మాయం చేశాయి. ఈ దురాగతాలన్నీ ఏమి తెలియజేస్తున్నాయి? సామ్రాజ్యవాదుల అధిక లాభాల కోసం, దేశాన్ని అమ్మటమే వృత్తిగా గల ఈ దోపిడీ పాలకవర్గాల (దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల) ప్రయోజనాల కోసం సైన్యం, పారామిలటరీ, పోలీసు బలగాలు ప్రజలను ఊచకోత కోసేందుకు ఏమాత్రం సంకోచించవు అనేది వీటి ద్వారా రుజువు కావడం లేదా? సామ్రాజ్యవాదుల కావలి కుక్కలమని వారు తమకు తామే రుజువు చేసుకోవడం లేదా? దోపిడీ ప్రభుత్వాలు నిర్దేశించిన క్రూరమైన, హింసాత్మక, హత్యా విధానాలనే అవి అమలు చేయలేదా? ఈ బలగాలు ఈ విధానాల్ని ఎన్నటికీ వదులుకోవు.

తాజాగా మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో దండకారణ్యంలో శిక్షణ పేరుతో 2011 మే చివరి నుంచి దఫదఫాలుగా భారత సైన్యాలు ఉద్యమం బలంగా ఉన్న ప్రాంతం దిశగా అడ్వాన్స్ అవుతున్నాయి. దీని ఫలితం ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. సహజ సంపదలకు నిలయంగా ఉన్న మాడ్ గుట్టలను సామ్రాజ్యవాదులకు, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం, ప్రత్యేకించి ప్రపంచంలో అత్యంత ప్రాచీన మాడియా ఆదివాసీ సముదాయానికి ఆలవాలమైన మాడ్ గుట్టల్లో 750 చ.కి.మీ. ప్రదేశాన్ని ఆక్రమించుకొని అక్కడి ఆదివాసీ ప్రజలను నిర్వాసితుల్ని గావించడం దీని లక్ష్యం. అంతేకాక దండకారణ్యంలోని వివిధ ఆదివాసీ సముదాయాలను విప్లవ పథంలో పురోగమింపజేస్తున్న మన పార్టీని, పార్టీ నాయకత్వాన్ని తుదముట్టించే మరో ప్రధాన లక్ష్యం కూడా దీని వెనక ఇమిడి ఉంది. ఈ విధంగా చూసుకున్నప్పుడు ఇది ప్రజా వ్యతిరేకమైనదే కాక, విప్లవ ప్రతీఘాతుకమైంది కూడా. ఇలాంటి విప్లవ ప్రతీఘాతుక భారత సైన్యాన్ని సైతం దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారా మట్టుబెట్టగలుగుతామని మావోయిజం మనకు స్పష్టం చేస్తుంది. చైనా, వియత్నాం ప్రజాయుద్ధాల చరిత్రే ఇందుకు తిరుగులేని ఉదాహరణ.

శత్రువు విప్లవోద్యమాన్ని 3 నుండి 7 ఏళ్లలో నిర్మూలించాలనే లక్ష్యంతో దాడి చేస్తున్నాడు. దీనిని వీలైనంత ఎక్కువ పొడిగించడం, తద్వారా భారత సైన్యాలను ఎటూతేలని దీర్ఘకాల యుద్ధంలో కూరుకుపోయేలా చేయడం మన లక్ష్యంగా ఉంటుంది. ఈశాన్య జాతుల పోరాటాలను, కాశ్మీరు జాతి పోరాటాన్ని అణచివేసే ఆపరేషన్ల నుంచి భారత సైన్యాలు ఇంకా బయటపడలేదు. ఒక రకంగా అవి దీర్ఘకాలంగా అక్కడ యుద్ధంలో కూరుకొని పోయి ఉన్నాయి. అనేక గెరిల్లా జోన్లలో గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడం, కొత్త గెరిల్లాజోన్లను సృష్టించడం ద్వారా భారత సైన్యాలను ఎక్కడా కేంద్రీకరించలేని స్థితికి నెట్టాలి. గెరిల్లా యుద్ధంతో ప్రజల దైనందిన, ఆర్థిక, రాజకీయ, హక్కుల పోరాటాలను అనుసంధానించి సాయుధంగా, సాయుధేతరంగా మిలిటెంట్‌గా సాగేలా చేయడం ద్వారా గెరిల్లా యుద్ధాన్ని శత్రువు ఎన్నటికీ తుడిచిపెట్టలేని అజేయమైన యుద్ధతంత్రంగా అభివృద్ధి చేయాలి.

విస్థాపన సమస్య అనేది ఈనాడు ప్రజల ముందు ఒక ముఖ్యమైన జీవన్మరణ సమస్యగా వుంది. భారత దోపిడి పాలక వర్గాల విస్థాపన విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు. మన పార్టీ, పిఎల్‌జిఏ, విప్లవ ప్రజాసంఘాలు, విప్లవ జనతన సర్కార్లు, ప్రజా మిలీషియా ఈ ప్రజలతో మరింత మమేకం కావాలి. నీళ్లల్లో చేపల్లా వారితో కలిసిపోవాలి. ఈ పోరాటాలను అణచివేయడంకై వచ్చే సైన్యాన్ని, పోలీసు బలగాలను గట్టిగా ఎదుర్కొనేలా ప్రారంభం నుండే వీటిని మిలిటెంట్ పోరాటాలుగా మలచాలి.

సైన్యం ప్రవేశంతో పాటే సైనిక దళాల ప్రత్యేక అధికార చట్టం ఉనికిలోకి రావడం,

తత్ఫలితంగా సాధారణ ప్రజల సామూహిక హత్యాకాండలు, మాయం చేయడం, అరెస్టులు, మహిళలపై అత్యాచారాలు, గ్రామ దహనాలు, ప్రజల ఆస్తుల లూటీ, విధ్వంసం, బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలు వంటి మాపింగ్ అప్ చర్యలు పెరగడం సైనిక చరిత్రంతటా ఉంది. కనుక, సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టానికి వ్యతిరేకంగా ప్రజల్ని పెద్దయెత్తున కదిలించాలి. 'భారత సైన్యం గో బ్యాక్' అనే నినాదంతో కలిసి వచ్చే శక్తులన్నింటిని కలుపుకొని విశాల ఐక్యసంఘటనను ఏర్పరుస్తూ శత్రువును రాజకీయంగా ఒంటరి చేయాలి. బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా, శవాల స్వాధీనం కోసం ప్రజలను విస్తృతంగా కదిలించాలి. ప్రజా ప్రతిఘటనా పోరాటాలను చేపట్టాలి. పౌరహక్కుల కోసం ప్రజా ఉద్యమాలు కొనసాగించాలి. ప్రజా ఉద్యమాలను సమరశీల ప్రతిఘటనా పోరాటాలుగా అభివృద్ధి చేసినప్పుడే ప్రజాయుద్ధంలో పెనుమార్పును తీసుకురాగలం.

శత్రువు ఎల్ఐసి పథకంలో భాగంగా 'ప్రజల హృదయాలను గెలుచుకుందాం' అనే ఎత్తుగడను అవలంబిస్తూ, 'అభివృద్ధి కార్యకలాపాలు– పోలీసు చర్యలు' అనే పాలసీలో భాగంగా 'సమగ్ర యాక్షన్ పథకం' (ఐఎపి)ని యుద్ధప్రాతిపదికన అమలు చేస్తున్నాడు. సాగు భూమి, నిర్వాసిత సమస్య, నీటిపారుదల వంటి మౌలిక సమస్యలపై కాక, రోడ్లు, కరెంటు, కమ్యూనికేషన్లు మొదలైన వాటికి ప్రాధాన్యత నిస్తున్నారు. దండకారణ్యంలోకి అర్ధసైనిక బలగాల అధికారులు, ఇటీవల వచ్చిన సైన్యం అధికారులు కూడా గ్రామాల్లో సివిక్ యాక్షన్ ప్రోగ్రాములు నిర్వహిస్తున్నారు. ప్రజలతో సమావేశాలు చేస్తున్నారు. ప్రజల్ని మోసం చేసేందుకు ఎన్నడూలేని విధంగా ప్రజల కొరకు సైన్యం శ్రమదానం చేస్తున్నది. స్కూళ్లల్లో విద్యార్థులకు దేశభక్తి పాఠాల పేరుతో మావోయిస్టు విప్లవకారులకు వ్యతిరేకంగా విషాన్ని నూరిపోస్తున్నారు. ప్రజల నుండి ఒక సెక్షన్‌ను చీలదీసి, గ్రామాల్లో వీరిని ఒక దొంతర (స్ట్రాటా) లాగా తయారు చేసి, అణచివేతలో వీరిని ప్రధాన వాహికలుగా ఉపయోగించుకోవడమే ఈ సంస్కరణల ఉద్దేశం. ఈ సంస్కరణల బూటకత్వాన్ని ప్రజల్లో ఎండగట్టాలి. వీటి ద్వారా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావని, దోపిడీ వ్యవస్థను కూల్చి నూతన ప్రజాస్వామిక రాజ్యాధికారం నెలకొల్పడమే పరిష్కారమని అర్థం చేయించాలి.

'ప్రజాపునాదితో సాగే ప్రజా యుద్ధమే విజయం సాధిస్తుందని' కామ్రేడ్ మావో పదే పదే బోధించారు. పాలకవర్గాల, వారి కిరాయి సాయుధ బలగాల దోపిడీ, పీడన, అణచివేతలను భరించలేని ప్రజలు విప్లవ పార్టీ, ప్రజా సైన్యం అందించిన స్ఫూర్తితో పెద్దయెత్తున ప్రతిఘటనా యుద్ధాలలోకి దిగిన చరిత్ర రష్యా, చైనా, వియత్నాం విప్లవోద్యమాలలో, అనేక జాతి విముక్తి పోరాటాలలో ప్రముఖంగా కనిపించే అంశం. ఈ ప్రజా ప్రతిఘటన ముందు బలమైన శత్రు సైనిక బలగాలు సైతం తుడిచిపెట్టుకుపోయాయి. ఈ ప్రజా ప్రతిఘటనే ప్రజాసైన్యం

బలపడేందుకు ఊటచెలిమ లాంటిది. అనతికాలంలో వేలు, లక్షలుగా ప్రజాసైన్యం విస్తరించాలంటే ఇటువంటి ప్రజా ప్రతిఘటనా పోరాటాలను పెద్దయెత్తున అభివృద్ధి చేయాలి. లాల్‌గఢ్, నారాయణపట్నా వంటి పోరాటాలు ఇప్పటికే ఒక ఆదర్శనీయమైన నమూనాను మన ముందుంచాయి.

భారత సైన్యాన్ని ఓడించాలంటే దానిలో రాజకీయ బలహీనతలను అధ్యయనం చేయడం ప్రధానమైన విషయంగా ఉంటుంది.

భారతసేన సాగించిన యుద్ధాలన్నీ భారత దోపిడీ పాలకవర్గాల దోపిడీ, పీడన, అణచివేత ప్రయోజనాల కోసం సాగించిన యుద్ధాలే తప్ప మరేమీ కాదనేది స్పష్టం. దీని ద్వారా దాని ప్రజావ్యతిరేక స్వభావం ఇప్పటికే ప్రజల్లో బహిర్గతమైంది. కాబట్టి దీనికి ప్రజల మద్దతు ఉ ండదు. ఇది దాని ప్రధానమైన రాజకీయ బలహీనత.

భారతసేనలోని సైనికులంతా పీడిత వర్గాల ప్రజల నుంచి రిక్రూట్ అయినప్పటికీ, వారు తమ వర్గం కోసం కాక దోపిడీ వర్గాల ప్రయోజనం కోసం పనిచేస్తుండడం ఒక పెద్ద వైరుధ్యం. అంటే తమ వర్గం కాని వర్గానికి వారు సేవ చేస్తున్నారు. ఈ వైరుధ్యం కారణంగా వారు అంకితభావంతో కాక జీతం రాళ్ల కోసం పనిచేయడం వారి స్వభావంగా ఉంటుంది. ఈ బలగాలలో ఆత్మహత్యలకు, పారుబోతుతనానికి ఇదే కారణం. అలాగే వీరి మీద వివిధ ప్రగతిశీల, విప్లవ, జాతి విముక్తి పోరాటాల ప్రభావం పడుతూనే ఉంటుంది. తమ పీడిత వర్గాలకు జరుగుతున్న దోపిడీ, పీడన, అణచివేతలను గుర్తించిన నాడు రష్యా, చైనా తదితర విప్లవోద్యమాలలో వలే సైనిక తిరుగుబాట్లు జరిగి వారే విప్లవ ప్రజా సైన్యంలో, జాతి విముక్తి సేనల్లో చేరిపోయే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. భారత పాలకవర్గాలు బలమైనదని చెప్పుకునే భారతసేనలోని అతి పెద్ద బలహీనమైన అంశం యిది. దీని కిరాయి స్వభావం రీత్యా వ్యూహాత్మకంగా దానికి సాహసించి పోరాడే లక్షణం ఉండదు. ప్రజల ప్రయోజనాల కోసం పోరాడే ప్రజా సైన్యంతో తలపడి అది వ్యూహాత్మక గెలుపు సాధించలేదు.

దీర్ఘకాలం సాగే గెరిల్లా యుద్ధంలో, గెరిల్లా యుద్ధాన్ని ఎదుర్కోవడంలో భారతసేనకు పెద్దగా అనుభవం లేదు. జాతుల పోరాటాలను, పంజాబ్ ప్రజల పోరాటాన్ని అణచడంలో, ఎల్‌టిటిఇపై సాగించిన దురాక్రమణ యుద్ధంలో భాగంగా అది గెరిల్లా యుద్ధంలో, గెరిల్లా యుద్ధాన్ని ఎదుర్కోవడంలో సాధించిన అనుభవం చాలా తక్కువ. ఎల్‌టిటిఇపై యుద్ధంలో అది చావుదెబ్బతిన్నది.

బలమైన ఇంటలిజెన్స్ లేని కారణంగా ఎల్‌టిటిఇపై యుద్ధంలో భారతసేన ఓడిపోయిందని భారత సైన్యమే సమీక్షించింది. నిజానికి, ప్రజలపై దాడికి ఒడిగట్టే సైన్యానికి, ప్రజా వ్యతిరేక

సైన్యానికి బలమైన హ్యూమన్ ఇంటలిజెన్స్ ఏర్పడడం కూడా కష్టం.

భారత సైన్యాలలో కింది స్థాయి జవాన్లకు, అధికారులకు; వేరు వేరు సాయుధ బలగాలకు, సైన్యానికి, పోలీసులకు మధ్య వున్న వైరుధ్యాలకు అసలు కారణాలను పోలీసు, అర్ధ సైనిక, సైనిక బలగాలకు వివరిస్తూ, దోపిడీ వర్గాల కోసం కిరాయి హంతకుల్లా పనిచేయవద్దని అవకాశం ఉన్న ప్రతిసారి వారికి అర్థం చేయించాలి. దోపిడీ ప్రభుత్వ సాయుధ బలగాల్లో చేరవద్దని, శత్రు రిక్రూట్‌మెంట్ క్యాంపేయిన్లను బహిష్కరించాలని, ఆత్మగౌరవంతో జీవించడానికి ఉద్యమించాలని యువతీ యువకులకు పిలుపునివ్వాలి. ఈ పిలుపును విస్తృతంగా ప్రచారం చేయాలి.

బయట ఉన్న పార్టీ నాయకత్వ శక్తుల్ని దెబ్బతీయడంలో విజయం సాధించిన శత్రువు, ఉద్యమ ప్రాంతాల్లో పై స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు వున్న నాయకత్వ శక్తులను నిర్మూలించడానికి సమాచార ఆధారిత దాడులకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నందున, యుఏవిలను (డ్రోన్‌లు–మానవ రహిత విమానాలు) సైతం మోహరించి అవకాశం కోసం ఎదురు చూస్తున్నందున, నాయకత్వాన్ని రక్షించుకోవడం ఎంతో ముఖ్య కర్తవ్యంగా మన ముందు ఉన్నది. ఇందుకోసం పార్టీ, పిఎల్‌జిఏ బలగాలు అన్ని రకాల కౌంటర్ ఎత్తుగడలను నిరంతరం ఆచరణలో అన్వయించడం మీద శ్రద్ధ పెట్టాలి. ప్రజా ప్రతిఘటనా పోరాటాల నుంచే ప్రజా ఇంటెలిజెన్స్‌ని పటిష్టం చేసుకోవాలి. విప్లవోద్యమ నాయకత్వ సమాచారం శత్రువుకు అందకుండా, శత్రువు సమాచారం ఎప్పటికప్పుడు పార్టీకి, పిఎల్‌జిఏకు, వివిధ ప్రజా నిర్మాణాలకు, ప్రజలకు అందేలా కృషి చేయాలి. శత్రువుకు రోజూ ఏదో ఒక తప్పుడు సమాచారాన్ని అందిస్తూ పుకార్లు వ్యాపింపజేయాలి. ఇందులో ప్రజల క్రియాశీల భాగస్వామ్యాన్ని పెంచాలి. ప్రజలలో వర్గపంథా–ప్రజాపంథా పట్ల అవగాహన పెంపొందేలా నిరంతరం రాజకీయ కృషిని సాగించడం ద్వారా శత్రువు ఏర్పాటు చేస్తున్న ఇన్ఫార్మర్ నెట్‌వర్క్ సమస్యను ఎదుర్కోవాలి.

భారతసేన ఓటమితోనే భారత నూతన ప్రజాస్వామిక విప్లవం విజయం ముడిపడి ఉంది. ప్రజల మౌలిక/దైనందిన సమస్యలను చేపడుతూ, ప్రజల జీవించే హక్కుకై బలమైన ప్రజా ప్రతిఘటనా యుద్ధాన్ని నిర్మించడం ద్వారా భారతసేనను తన్నితరమాలి, ఓడించాలి.

**ప్రశ్న 6 : పి.ఎల్.జి.ఏ.ను పి.ఎల్.ఏ.గా మార్చుదాం అని పార్టీ ఇస్తున్న నినాదానికి అర్థం ఏంటి?**

**బి.ఆర్. :** విప్లవాన్ని విజయవంతం చేయడానికి మూడు అద్భుత ఆయుధాలు అవసరం : పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటన. పార్టీ అనే యోధ చేతిలో ప్రజాసైన్యం, ఐక్యసంఘటన అనే రెండు ఆయుధాలు విప్లవ విజయానికి అత్యావశ్యకం. మన ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ “దండకారణ్యాన్ని, బీహార్–ఝార్ఖండ్‌లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకై గెరిల్లా

యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా, పిఎల్‌జిఏను పిఎల్‌ఏగా అభివృద్ధి చేయాలనే” కేంద్ర, ప్రధాన, తక్షణ కర్తవ్యాన్ని యావత్ పార్టీ, పిఎల్‌జిఏ, విప్లవ ప్రజా సంఘాలు, విప్లవ ప్రజా కమిటీలు (ఆర్.పి.సి.)/క్రాంతికారీ జనతన సర్కార్ల ముందుంచింది. విముక్తి ప్రాంతాలను నిర్మించాలంటే పిఎల్‌జిఏను పిఎల్‌ఏ (ప్రజా విముక్తి సైన్యం)గా అభివృద్ధి చేయడం అనివార్యం. పిఎల్‌ఏ అంటే రెగ్యులర్ సైన్యం. రెగ్యులర్ సైన్యమే గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేయగలుగుతుంది. మన పార్టీ నేతృత్వంలో పిఎల్‌జిఏ గత ఐదు సంవత్సరాలుగా చేసిన కృషి ఫలితంగా వివిధ గెరిల్లా జోన్లలో గెరిల్లా యుద్ధం తీవ్రతరమవుతోంది. పిఎల్‌జిఏ కొన్ని మొబైల్ యుద్ధ స్వభావం గల చర్యలను కూడా నిర్వహించింది. ఉదాహరణకు, ముకరం-తాడిమెట్ల ఆంబుష్, ‘ఆపరేషన్ రోప్ వే’-నయాగఢ్ ఆపరేషన్, కజరా, లోహార్‌దగా (ధర్‌ధరియా) మొదలైనవి. ఇంకా అనేక చర్యలు కూడా నిర్వహించింది. అంటే క్రమంగా పిఎల్‌జిఏ యుద్ధం సాగిస్తూనే యుద్ధంలో రాటుదేలుతోంది. అలాగే ప్రజా పోరాటాల ద్వారా ప్రజల్ని రాజకీయంగా చైతన్యవంతం చేస్తూ సాయధం చేసి ప్రజాయుద్ధంలో భాగస్వామ్యం చేస్తూ, రిక్రూట్ చేసుకొనే ప్రక్రియను మెట్టు మెట్టుగా పెంపొందించడం ద్వారా పిఎల్‌జిఏ ఫార్మేషన్లను విస్తరింపజేస్తూ బెటాలియన్లను, రెజిమెంట్లను అభివృద్ధి చేయాలి. టెర్రయిన్‌పై పట్టును సాధిస్తూ, శత్రు బలహీనతలను కనిపెడుతూ గెరిల్లా ఎత్తుగడలను స్థల, కాలాలకు అనుగుణంగా సృజనాత్మకంగా అన్వయిస్తూ ఎల్లప్పుడూ చొరవను చేతిలో ఉంచుకోవాలి. ప్రజల చురుకైన మద్దతును సాధిస్తూ సాధ్యమైన మేరకు శత్రువును నిర్మూలిస్తూ, ఆయుధాలను సమకూర్చుకొని, కొత్త రిక్రూట్లను, ప్రజలను సాయుధం చేస్తూ పురోగమించాలి. పిఎల్‌జిఏ బలగాల పోరాట సామర్థ్యాన్ని పెంచడం, వాటిలో ఉన్నతస్థాయి క్రమశిక్షణను నెలకొల్పడం, ప్రధానంగా శత్రువుపై చేసే దాడులపై ఆధారపడుతూ సాయుధ శక్తిని పెంపొందించుకోవడం, యుద్ధ నిర్వహణకు అవసరమైన అనుబంధ విభాగాలను క్రమ క్రమంగా పెంచుకోవడం కోసం పథకం ప్రకారం కృషి చేయాలి. ఈ మార్గంలోనే పిఎల్‌జిఏను పిఎల్‌ఏ వైపుగా అభివృద్ధి చేయడం సాధ్యమవుతుంది. తద్వారానే మన పార్టీ ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ ఇచ్చిన కేంద్ర, ప్రధాన, తక్షణ కర్తవ్యాన్ని మనం నెరవేర్చగలుగుతాం. పిఎల్‌జిఏను పిఎల్‌ఏగా మార్చుదాం అనే నినాదానికి అర్థం ఇదే.

ఆగస్టు 13, 2012